క్లుప్తంగా

రేపటి నుంచి రఖీబ్ షావలీ దర్గా ఉరుసు



హజరత్ రఖీబ్‌షావలీ దర్గా

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని హజరత్ జలాలి రఖీబ్‌షావలీ రహమతుల్లా 163వ ఉరుసు ఉత్సవం శుక్ర, శని వారాల్లో నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 9.00 గంటలకు ఫకీర్ల మేళతాళాలతో పూలచాందినీ ఊరేగింపుగా గంధం కలశాన్ని దర్గాకు చేర్చనున్నారు. గురువుల మజార్‌పై సమర్పించాక ఫాతెహా చేయనున్నారు. ఉరుసు సందర్భంగా శనివారం రాత్రి 10.00 గంటలకు నగరం నుంచి ఊరేగింపుగా గంధం కలశాన్ని దర్గాకు తీసుకు వచ్చి ఫాతెహా చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకులచే ఖవ్వాలీ కచేరీ నిర్వహించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



పోస్టల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, ఉద్యోగులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : తమ అపరిష్కృత సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ కడప డివిజన్ బ్రాంచ్ సెక్రటరీ రాము కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కారులు కడప నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ డాక్ సేవక్స్‌ను డిపార్టుమెంట్ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. యూనియన్ నాయకులు మాబు సుబాన్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



జీవన్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ కడప శాఖ అధ్యక్షులుగా పనిచేస్తున్న జీవన్ చంద్రశేఖర్ తన సేవలను విస్తతం చేయాలని పలువురు రెవెన్యూ అధికారులు కోరారు. జీవన్‌చంద్రశేఖర్‌కు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కడంపై కడప నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలపై చర్చించారు. ఈనెల 8వ తేదీ తిరిగి మరోమారు సమావేశమై సమస్యలను కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కేపీ రొనాల్డ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఖండించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రంలోని బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న జాతీయ ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధుల ఇళ్లపై, శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, కళాకారుల, ప్రతిపక్ష నాయకుల గృహాలపై దాడులు చేయడం తగదన్నారు. భారత రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన భావ ప్రకటనకు, పౌర హక్కులు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను ఉల్లఘించడం తగదన్నారు.

ముమ్మర ప్రచారం



గ్యాంగ్‌మెన్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న నందలూరు మజ్దూర్ యూనియన్ సభ్యులు

రాజంపేట : సౌత్ సెంట్రల్ రైల్వే కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డెలిగేట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ తరపున పోటీ చేస్తున్న కడప, నందలూరు అభ్యర్థులు పీ.కిరణ్‌బాబు, పీ.గురు వినోద్‌కుమార్‌ను గెలిపించాలని బుధవారం ఉభయ జిల్లా పరిధిలో పలు రైల్వేస్టేషన్లలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలుసుకొని ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈనెల 12 సౌత్‌సెంట్రల్ రైల్వే జోన్ స్థాయిలో డివిజన్‌లో 28 డెలిగేట్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నందలూరు మజ్దూర్ యూనియన్ బ్రాంచి సెక్రటరీ కె.విశ్వనాథ్ మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మజ్దూర్ ప్యానెల్‌ను కార్మికులు గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ చైర్మన్ పీ.గోపినాథ్, కోశాధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా



ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చిన వారికి మందులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని, పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోరి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎర్రముక్కపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ ప్రాంత సమీపంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద గల ఖాళీ ప్రదేశ మైదానంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ హెచ్ బి కాలనీ, అరవింద నగర్, మారుతి నగర్, వై ఎం. పల్లి ప్రాంతాలకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష 3 వ క్యాంపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష మాట్లాడుతూ ప్రతి పేదవాడికి వైద్యం కూడా వారి గడప వద్దకే అందించాలనే ఆలోచనతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. ఈ శిబిరంలో 11 రకాల పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారన్నారు. తొలుత ఉప ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్యులతో, సిబ్బందితో అక్కడికి విచ్చేసిన రోగులతో వివరాలు తెలుసుకొని కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, డీఎం అండ్‌హెచ్‌ఓ డా. నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, నగర డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి, కార్పొరేటర్లు వై. మాధవి, సుజాత, శిరీష, రామలక్ష్మణ్‌రెడ్డి, ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, పార్టీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, డా.శివా నాయక్, డా. సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం

కడప రూరల్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపకులు షా మహమ్మద్, కడప అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక మట్టి పెద్ద పులి వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మహబూబ్‌బాష, చాంద్, గౌస్‌బాష, సయ్యద్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 8/4 డివిజన్‌లోని శంకరాపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా సంధ్య అనే మహిళ తనకు వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ. 10,56,268 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది.

ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం లో మాకు అందలేదని ఇలాంటి ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 8వ డివిజన్ ఇంచార్జి ఏ. బాలకృష్ణారెడ్డి, నాయకులు జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య, సీహెచ్ వినోద్, సుబ్బారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అరీఫుల్లాబాషా, మహిళా నేతలు పాల్గొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం

కడప కార్పొరేషన్ : బుడగజంగాలను ఎస్సీ జాబితాలో కలపాలని శాసన సభలో తీర్మాణం చేయడం వల్ల ఆ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైఎస్ఆర్‌సీపీ యువజన జిల్లా కార్యదర్శి పస్తం అంజి ఆధ్వర్యంలో కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపి పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యాసిన్ బాషా, బుడగ జంగం నాయకులు కే లక్షుమ్మయ్య, డి. రాముడు, ఆంజనేయులు, సి చిన్న వెంకటయ్య, పి శ్రీను, కే మంతయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా హక్కులు సాధించుకుందాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బుడగ జంగాలు సంఘటితంగా ఉంటూ తమ హక్కుల సాధనకు ముందుకు సాగాలని బుడగ జంగాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్ తెలిపారు. బుధవారం బుడగ జంగాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మనోహర్ మాట్లాడుతూ బేడ బుడగజంగం సంక్షేమ సంఘం కృషి వల్ల మన ఉనికిని ప్రభుత్వం స్పందించి ఎస్సీ జాబితాలో జరిగిన తప్పిదాలను సవరణ చేసేందుకే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం శుభసూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బుడగజంగం కాలనీ వాసులు యస్.ఎర్రన్న, సి.శివాజీ, కే.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు మరమ్మతు చేయించాలి



అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థకు సంబంధించిన వాహనాలకు వెనువెంటనే మరమ్మతులు చేయించాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పాత మున్సిపల్ ఆఫీసు, సెంట్రల్ జైలు వద్దనున్న శ్మశాన వాటిక, మహాప్రస్థానం శ్మశానవాటిక, సంజన్న సర్కిల్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాహనాల నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. గార్బేజ్ స్టేషన్ నందు ప్రతిరోజూ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశాన వాటికలో గ్రీనరీ పెంచాలన్నారు. అనంతరం ఏపీహెచ్‌బీ కాలనీలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆ తర్వాత 37వ డివిజన్ అల్మాస్‌పేట సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్లు, సర్వీసు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, డీఈలు రాజేష్, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై దాడి

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శివానందపురానికి చెందిన బాలాజీ విద్యుత్ భవన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం కార్యాలయం ఆవరణంలోని పార్క్‌లో సిగరెట్లు తాగుతున్నారని ఉన్నతస్థాయి అధికారులు వాచ్‌మెన్‌కు చెప్పారు. ఈక్రమంలో వారిలో ఒకరు వాచ్‌మెన్ బాలాజీ ముఖంపై దాడి చేశాడు. గాయపడిన బాలాజీని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కోసం కడప ఒన్‌టౌన్ పోలీసులకు బదిలీ చేశారు.

జీవనభృతితో ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రూ. 8 వేల జీవన భృతిని అందించి ఆదుకోవాలని ఆర్టీసీ వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథరెడ్డి కోరారు. బుధవారం ఈ మేరకు ఇతర యూనియన్ నాయకులతో కలిసి ఆయన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, వెంకటయ్య పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

కడప ఎడ్యుకేషన్ : ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నవంబర్ 8వ తేదీన జరిగే అఖిల భారత విప్లవ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్, నగర సహాయ కార్యదర్శి శ్రీనాథ్ కోరారు. బుధవారం కడప ప్రగతి నర్సింగ్ హోమ్‌లో రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

బుడ్డశనగ విత్తనాల పంపిణీ

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిదెన రైతు భరోసా కేంద్రంలో బుధవాం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన బుడ్డశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. 40 శాతం రాయితీతో ఏ ప్రభుత్వం అందించలేదన్నారు.

అనంతరం రైతులకు రాయితీ విత్తనాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసుదేవ రెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఉత్తమారెడ్డి, ఈర్లపల్లె శ్రీనివాసుల్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, గంగాదర, వ్యవసాయ సహాయకుడు శివబాష, రైతులు పాల్గొన్నారు.

'మొల్ల సాహితీ స్మారక ఫలకం' ఆవిష్కరణ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆవరణలో స్థానిక మొల్ల సాహితీపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొల్ల సాహితీ స్మారక ఫలకాన్ని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొల్లమాంబ జన్మస్థలం గోపవరంలో ఆమె విగ్రహం ఏర్పాటుతో పాటు ఆ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడం వెనుక విద్వాన్ గానుగపెంట హనుమంతరావు చేసిన కృషి అభినందనీయమన్నారు. వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ కేంద్రంలో మొల్ల సాహితీ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం గానుగపెంటను వీసీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైవీయూ తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్య పి.రమాదేవి, విశ్రాంత తెలుగు పండితులు డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, బ్రౌన్ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు త్రిదండి సంపత్‌కుమార జీయర్ స్వామి రాక

కడప కల్చరల్ : విజయవాడకు చెందిన అష్టాక్షరి పీఠాధిపతి శ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామాను జీయర్ స్వామి శుక్రవారం ఉదయం 9.00 గంటలకు కడప నగరంలోని అమ్మవారిశాల వద్దగల వాసవీ సదన్‌కు రానున్నట్లు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజుగుప్తా, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, మునగా శ్రీనివాసకుమార్, పుట్టా రంగయ్య తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

బజాజ్ పల్సర్ ఎన్–150 మార్కెట్‌లోకి విడుదల



కొనుగోలుదారుకు బైక్ తాళాలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్ : బజాజ్ ఆటో కంపెనీ సరికొత్తగా విడుదల చేసిన పల్సర్ ఎన్–150 బైక్ మార్కెట్‌లోకి విడుదలైంది. బుధవారం స్థానిక అల్మాస్‌పేటలోని హరూన్ బజాజ్ షోరూంలో నూతన బైక్‌ను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబులు ఆవిష్కరించారు. మొదటి వాహనం కొనుగోలు చేసిన వినియోగదారునికి తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హరూన్ బజాజ్ ఎండీ ఎస్‌బీ అహ్మద్‌బాష, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కడప ఎస్టీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన మున్సిపల్ ఉపాధ్యాయుల సమావేశంలో సర్వీస్ రూల్స్ లేక ప్రమోషన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఎన్నో రోజుల నుంచి ఉన్న స్థానాల్లోనే ఉద్యోగం చేస్తున్నారన్నారు. పదేళ్ల నుంచి బదిలీలు జరగక ఏ పాఠశాలలో ఉపాధ్యాయులు అక్కడే ఉండిపోయారన్నారు. ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులకు విధివిధానాలు రూపొందించి బదిలీలు, ప్రమోషన్లు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుపాకుల మురళి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, గౌరవ సలహాదారు క్రిస్టఫర్‌జాన్, జిల్లా కార్యదర్శులు, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఏమైందో బీజేపీ సమాధానం చెప్పాలి

కడప ఎడ్యుకేషన్ : తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన ప్రత్యేక హోదా సంగతి ఏమైందో బీజేపీ సమాధానం చెప్పాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరం ఐటిఐ సర్కిల్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో ఉన్న కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటే తెలుగు ప్రజలు సంతోషిస్తామని తెలిపారు. అలా కాకుండా కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ లబ్ధి కోసం మరోసారి తెలుగు ప్రజలను మోసం చేయాలని అనుకుంటే బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

పశు పోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి

ప్రొద్దుటూరు : పశు పోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం వలన అధిక లాభాలను పొందవచ్చని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు తెలిపారు. మండలంలోని తాళ్లమాపురంలో పశుధన్ ప్రగతి అభియాన్, భారత ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆర్థిక సహాయంతో పశువైద్యకళాశాల ఆధ్వర్యంలో పశువులలో పునరుత్పత్తి, ఫలదీకరణ శిబిరం, రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎం.కొండారెడ్డి పశు పోషకులు అధికారుల సలహాలు, సూచనలు విని ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ జమ్మలమడుగు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఏ శ్రీనివాసులురెడ్డి, డివిజనల్ ఏడీ ఆర్. శ్రీధర్‌రెడ్డి, ప్రొద్దుటూరు డివిజనల్ ఏడీ డాక్టర్ ధనుంజయ్‌రెడ్డి పశువుల యాజమాన్య పద్ధతులను వివరించారు.

విష జ్వరాలపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల నగరవ్యాప్తంగా విష జ్వరాలు పెరుగుతున్నాయని వాటిపైన వైద్యాధికారులు నగరపాలక సంస్థ ప్రతినిధులు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చేపల పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల, డ్రైనేజీ వాటర్ వల్ల దోమల బెడద వల్ల జ్వరాలు పెరుగుతున్నాయని వాటిని నియంత్రించడం నగరపాలక సంస్థ అధికారుల బాధ్యత అన్నారు. నగరంలోని అన్ని డివిజన్‌లలో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు.

ఉపాధి కార్యాలయ ఉద్యోగుల బదిలీ

వల్లూరు : వల్లూరు ఉపాధి హామీ పథకం కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీవో పార్థసారథి వీరపునాయునిపల్లె ఏపీవోగా బదిలీ అయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్లు రామలింగారెడ్డి కమలాపురం క్లస్టర్ కార్యాలయానికి, లక్ష్మినారాయణ వీరపునాయునిపల్లె మండలానికి బదిలీ అయ్యారు. టెక్నికల్ అసిస్టెంట్‌లు లక్ష్మికుమారి పెండ్లిమర్రి మండలానికి, శ్రీవాణి ఖాజీపేట మండలానికి, రెడ్డెయ్య ఆచారి బ్రహ్మంగారిమఠం మండలానికి బదిలీ ఆయ్యారు. కాగా వీరి స్థానాల్లో చెన్నూరు నుంచి ఏపీవో సుధారాణి, ఖాజీపేట నుంచి కంప్యూటర్ ఆపరేటర్ ఉమా, కడప డ్వామా కార్యాలయం నుంచి కంప్యూటర్ ఆపరేటర్ సౌజన్య, ఏపీడీ కార్యాలయం నుంచి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, చెన్నూరు నుంచి పెద్దపెంచలయ్య, చింతకొమ్మదిన్నె నుంచి టెక్నికల్ అసిస్టెంట్ రామి రెడ్డి బదిలీపై నియమించబడ్డారు.

నిర్మాణంలో ఆలస్యం జరిగితే జరిమానా వేస్తా

ప్రొద్దుటూరు : సకాలంలో పనులు పూర్తి చేయకుండా ఆలస్యం జరిగితే అందుకు తగినట్లుగా కాంట్రాక్టర్‌కు జరిమానా విధిస్తానని ప్రజారోగ్య శాఖ ఎస్‌ఈ శ్రీనాథరెడ్డి తెలిపారు. రూ.50.90 కోట్లతో నిర్మిస్తున్న స్థానిక కూరగాయల మార్కెట్‌ను బుధవారం సాయంత్రం అనంతపురం నుంచి వచ్చిన ఎస్‌ఈ పరిశీలించారు. గతంలో వచ్చినప్పుడు ఇప్పటికి పనుల్లో పెద్ద వ్యత్యాసం కనిపించలేదన్నారు. ఎక్కువ మంది కూలీలను నియమించి పనులు వేగంగా చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అనంతరం గోకుల్ నగర్‌ను పరిశీలించారు. రూ.160 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలో నిర్మించనున్న డ్రైనేజీ కాలువల ఆధునీకరణ పనులను ఈ వీధి నుంచే ప్రారంభిస్తామని ఎస్‌ఈ తెలిపారు. అనంతరం సినీ హబ్ వద్ద ఉన్న మడూరు డ్రైనేజీ కాలువను పరిశీలించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుట్టపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ జేసునాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవరంగుట్టపల్లె పాఠశాలకు చెందిన విద్యార్థులు రాయచోటిలోని మూసాపేట ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్–14, అండర్–17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగంలో 7 మంది విద్యార్థినీలు, 5 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అలాగే మండలంలోని గురిజాలకు చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఈనెల 2వ తేదీ జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీలలో మంచి ప్రతిభ చూపించడంతో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యార్థి ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మైదుకూరులో జరిగే అండర్–17 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థుల ఎంపికపట్ల పాఠశాల హెచ్‌ఎం లక్ష్మిరమణమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



మున్సిపల్ భవవ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్

కమలాపురం : మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనానికి ఆయన ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, పరిశ్రమల శాఖ రాష్ట్ర సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, అగ్రికల్చర్ స్టేట్ అడ్వైజర్ తిరుపాల్‌రెడ్డితో కలసి భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. ఇప్పటికే రూ.36 కోట్ల వ్యయంతో డ్రైనేజ్ కాలువలు నిర్మించామన్నారు. మరో రూ.18 కోట్లతో పెద్ద కాలువల నిర్మాణం, రూ.58 కోట్లతో మంచి నీటి పైప్‌లైన్ పనులు చేపట్టామన్నారు. అలాగే డివైడర్, రోడ్డు వైండనింగ్ పనులు కూడా చేస్తున్నామన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణానికి ఇప్పటికే ఆరు సార్లు టెండర్లు పిలిచినప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదన్నారు. ప్రస్తుతం ఈ పనులను కేంద్రం పరిధిలోని సేతు బందుకు జతచేస్తామని, టెండర్లు పిలుస్తున్నామని, ఖరారు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే బైపాస్ కూడా నిర్మిస్తామన్నారు. మున్సిపాలిటీ భవన నిర్మాణం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వసతులతో రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. ట్రాక్టర్లు, పారిశుద్ధ్య సామాగ్రి నిల్వ ఉంచడానికి విశాలమైన గదులు, కౌన్సిల్ హాల్ నిర్మించాలంటే ఇంత కంటే అనువైన స్థలం లేదన్నారు. ఈ కార్యాలయం ప్రారంభం నాటికి ఆర్‌ఓబీ పూర్తి అవుతుందని, ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. ప్రజలు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి, వైస్ చైర్మన్లు సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎన్సీ పుల్లారెడ్డి, బాల గంగాధర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

చెన్నూరు : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాయని, క్షేత్రస్థాయిలో ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సభా భవనంలో, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్.భాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ వీఎస్ఆర్, సుబ్బారెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

కమలాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు లాంటివని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నచెప్పలిలో రూ. 1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్‌బీకేను అగ్రికల్చర్ స్టేట్ అడ్వైజర్ తిరుపాల్‌రెడ్డి, విలేజ్ క్లినిక్‌ను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారు చిన్నచెప్పలి ఆర్‌బీకేలో రైతులకు 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను అందజేశారు.

ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వల్లూరు : పార్టీ అభివృద్ధిలో సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథుల పాత్ర కీలకమని, వైఎస్ ఆర్‌సీపీ నేతలతో కలిసి ప్రభుత్వ విధానాలను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. వల్లూరులో బుధవారం జరిగిన వైఎస్ఆర్‌సీపీ నేతలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య రక్షణే ప్రధాన ధ్యేయంగా సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, పార్టీ నేతలు ఇందులో పూర్తిస్థాయిలో పాలు పంచుకుని అందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి కృషి చేయాలని అన్నారు. ఈనెల 11 నుంచి ప్రారంభం కానున్న మా నమ్మకం నువ్వే జగన్ – ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే సీఎం కావాలి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలన్నారు. సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారధులకు పార్టీ బీమా సదుపాయాన్ని కల్పించిందని, ఈనెల 7వ తేదీ లోపు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ వలంటీర్లందరికీ తన సొంత నిధులతో బీమా సదుపాయాన్ని కల్పిస్తున్నానని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ నేతలు శివకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.